RNI. No. APTEL/2011/41055




ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 342 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | శుక్రవారం, 14 జూన్ 2024 | పేజీలు : 4 | వెల : 2/-

# పూర్తి స్థాయి బడ్జెట్ కోసం ప్రభుత్వం కసరత్తు

## శాఖల నుంచి బడ్జెట్ ప్రతిపాదనలను తెప్పించుకుంటున్న ఆర్థిక శాఖ

## గత ఆరు నెలల ఆమ్దానీ, ఖర్చుల వివరాలు తీసుకుంటున్న ప్రభుత్వం

### గ్యారంటీలకు అధిక కేటాయింపులు చేసేలా ప్లాన్

### జులై మొదటి వారంలో రాష్ట్ర బడ్జెట్ పెట్టేందుకు ఏర్పాట్లు




హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం 2024-, 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పూర్తి స్థాయి బడ్జెట్ కోసం ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ఆర్థికశాఖ అన్ని శాఖల నుంచి ప్రతిపాదనలు కోరింది. ఈనెల 18వ తేదీ వరకు ఆయా శాఖల ద్వారా ప్రతిపాదనలు చేరాలని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2024,-25 సంవత్సరానికి మొత్తం రూ. 2,75,891 కోట్లతో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. మొత్తం బడ్జెట్‌లో రెవెన్యూ వ్యయం రూ. 2,01,178 కోట్లు, మూలధన వ్యయం రూ. 29,669 కోట్లుగా పేర్కొంది. దీంతోపాటు ఈ బడ్జెట్‌లో ఎన్నికల హామీల అమలు కోసం ప్రభుత్వం రూ. 53,196 కోట్లు ప్రతిపాదించింది. వ్యవసాయానికి రూ. 19,746 కోట్లు, నీటిపారుదల కోసం రూ. 28,024 కోట్లను ప్రతిపాదించారు. ఇలా నాలుగు నెలల కాలానికి ఓటాన్ అకౌంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తీసుకున్నందున జూలై నెలాఖరులోపు పూర్తి స్థాయి బడ్జెట్ కోసం కసరత్తు చేస్తోంది. ఉభయసభలు ఈ బడ్జెట్‌కు ఆమోద ముద్ర వేయాల్సి ఉంది. అయితే ఈసారి పూర్తి స్థాయి బడ్జెట్ కోసం ప్రభుత్వం కసరత్తు చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ ప్రాధాన్యతా పథకాలు, ఇటీవల ముఖ్యమైన ప్రకటనలను దృష్టిలో పెట్టుకోవాలని ఈ బడ్జెట్‌కు రూపకల్పన చేయాలని సిఎం నిర్ణయించినట్టుగా తెలిసింది. ఈ నేపథ్యంలోనే అన్ని శాఖలు వివిధ పథకాల పద్దులకు సంబంధించిన క్షుణ్ణంగా సమీక్షించుకొని ప్రతిపాదనలు ఇవ్వాలని స్పష్టం చేసింది.

**రైతు రుణమాఫీకి రూ. 33,000 నుంచి రూ. 35 వేల కోట్ల వరకు..** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు దాదాపుగా 6.71 లక్షల కోట్ల అప్పుల భారం ఉండగా వరుసగా ఎఫ్ఆర్ఎంబి పరిధిలో అవకాశాల మేరకు అప్పుల మీద అప్పులు చేస్తూ బాండ్లు తాకట్టు పెడుతూ పాలన కొనసాగిస్తోంది. ఇప్పటికే ఆరునెలల్లో ఎఫ్ఆర్ఎంబి పరిధికి మించి రూ. 12,905 కోట్ల అప్పులు చేసింది. గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలతో కలిపి చెల్లింపులకు రేవంత్ ప్రభుత్వం సగటున రోజుకు రూ. 290 కోట్ల మేరకు చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది. దీంతోపాటు కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు భారీగా పేరుకుపోవడంతో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. వాటికి తోడు ఆగస్టు 15వ తేదీ లోపు రైతు రుణమాఫీకి రూ. 33,000 కోట్ల నుంచి రూ. 35,000 కోట్ల వరకు అవసరమని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ హామీని కచ్చితంగా అమలు చేసి తీరాల్సిందేనని, నిధుల సేకరణకు ప్రణాళిక రూపొందించాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించడంతో, ఆర్థిక శాఖ అధికారులు కసరత్తు చేపట్టారు. ఈ క్రమంలోనే కార్పొరేషన్ ఏర్పాటు చేసి రుణమాఫీ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.

దీనికి రిజర్వ్ బ్యాంకు అంగీకరించాల్సి ఉంటుంది. లేదంటే ప్రత్యామ్నాయ ఆదాయ వనరులు సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అలాగే రైతుల పంట బీమాకు ప్రభుత్వం ఏటా 2వేల కోట్ల ప్రీమియం చెల్లించాల్సి ఉంది. రాష్ట్రంలో 1.32కోట్ల ఎకరాల్లో పంటలు సాగు అవుతుండగా 2019 నుంచి ఫసల్ బీమా అమల్లో లేదు. ఇప్పుడు ప్రభుత్వం పంటల బీమాకు ప్రీమియం భరించాల్సి ఉంది. ఇకపోతే రైతుబంధు ఖరీఫ్ పంటల సాగు ప్రారంభమైనా ఇంకా ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ ప్రారంభించలేదు. ఈ నేపథ్యంలోనే పూర్తి స్థాయి బడ్జెట్‌లో హామీల అమలుకు ఎంత కేటాయిస్తారు? ఆదాయం పెంపుపై ఎలాంటి చర్యలు చేపట్టారన్నది త్వరలోనే తేలనుంది.

**మరో 45 రోజుల గడువు మాత్రమే...** %ఫిబ్రవరిలో నాలుగు నెలల కాలానికి ఓటాన్ అకౌంట్‌కు అనుమతి తీసుకున్నందున జూలై నెలాఖరులోపు పూర్తి స్థాయి బడ్జెట్‌కు మరో 45 రోజులు మాత్రమే గడువు ఉన్న తరుణంలో పూర్తి స్థాయి బడ్జెట్ రూపకల్పన చేసేలా ఆర్థికశాఖ కసరత్తు ప్రారంభించింది. అందులో భాగంగా పూర్తి స్థాయి బడ్జెట్ రూపకల్పన ప్రక్రియలో భాగంగా ఆర్థికశాఖ అన్ని శాఖల నుంచి ప్రతిపాదనలను కోరింది. ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి సంబంధించి ఆయా శాఖల పనితీరు సూచికల ఆధారంగా నిర్దేశించిన లక్ష్యాల పూర్తి వివరాలను ఇవ్వాలని ఆర్థికశాఖ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్య పథకాలకు బడ్జెట్ ప్రతిపాదనల్లో తగిన కేటాయింపులు చేయాలని నిర్ణయించింది. బడ్జెట్ అంచనాలకు తగిన హేతుబద్ధత ఉండాలని ఆర్థిక శాఖ తెలిపింది. కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించి రాష్ట్ర అవసరాలను పరిగణనలోకి తీసుకొని వీలైనన్ని ఎక్కువ నిధులు పొందేలా స్పష్టమైన మార్గదర్శకాలకు లోబడి ప్రతిపాదనలు తయారు చేయాలని ప్రభుత్వం తెలిపింది. బడ్జెట్ కసరత్తుపై తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. కేవలం పథకాలకు సంబంధించిన వ్యయ ప్రతిపాదనలను మాత్రమే ఇవ్వాలని ఆర్థికశాఖ తెలిపింది. నిర్వహణ వ్యయానికి సంబంధించి గతంలో ఇచ్చిన ప్రతిపాదనల ఆధారంగా కేటాయింపులు చేయాలని పేర్కొంది.




## రాజ్యసభలో 10 స్థానాలు ఖాళీ

ఢిల్లీ: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పలువురు రాజ్యసభ సభ్యులు లోక్ సభకు పోటీ చేసి విజయం సాధించారు. దీంతో ఎగువ సభలో 10 స్థానాలు ఖాళీ అయ్యాయి. ఈ వివరాలను రాజ్యసభ సెక్రటేరియట్ అధికారికంగా వెల్లడించింది. 18వ లోక్సభకు ఎన్నికైన నేపథ్యంలో జూన్ 4 నుంచి వారి రాజ్యసభ సభ్యత్వం నిలిచి పోయినట్టు రాజ్యసభ సెక్రటేరియట్ తెలిపింది.

రాజ్యసభ ఎంపీగా ఉంటూ పోటీ చేసి గెలిచిన పీయూష్ గోయల్కు వాణిజ్యం, పరిశ్రమలు, సర్బానంద సోనోవాల్కు నౌకాశ్రయాలు, నౌకాయానం, జలరవాణా, జ్యోతిరాదిత్య సింధియాకు కమ్యూనికేషన్లు, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి, టెలికాం శాఖలు దక్కాయి. కామాఖ్య ప్రసాద్ తాసా, సర్బానంద సోనోవాల్ (అస్సాం), మీసా భారతి, వివేక్ కుమార్ (బిహార్), ఉదయన్రాజే భోంస్లే, పీయూష్ గోయల్ (మహారాష్ట్ర), దీపేందర్ సింగ్ హుడా (హర్యానా), కేసీ వేణుగోపాల్ (రాజస్థాన్), బిప్లబ్ కుమార్ దేబ్ (త్రిపుర), జ్యోతిరాదిత్య సింధియా (మధ్యప్రదేశ్)లు ఈ జాబితాలో ఉన్నారు. వీరంతా లోక్సభ ఎన్నికల్లో ఆయా స్థానాల నుంచి గెలుపొందారు. రాజ్యసభ సెక్రటేరియట్ నుంచి నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో.. ఈ ఖాళీల భర్తీకి ఎన్నికల కమిషన్ తేదీలను ప్రకటించనుంది.

## రాష్ట్రవ్యాప్తంగా మహిళా శక్తి క్యాంటీన్లు: సీఎస్ శాంతికుమారి



హైదరాబాద్: రాష్ట్రంలో మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వెల్లడించారు. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 150 మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామైక్య సంఘాలకు వీటి నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తామని తెలిపారు. కలెక్టరేట్లు, దేవాలయాలు, బస్టాండ్లు, పారిశ్రామిక, పర్యాటక ప్రాంతాలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఈ క్యాంటీన్లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. బెంగాల్‌లోని దీదీ కా రసోయ్, కేరళలోని క్యాంటీన్లపై ఇప్పటికే అధ్యయనం చేసినట్లు సీఎస్ వివరించారు. వీటి నిర్వహణపై మహిళా సంఘాలకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ మేరకు వివిధ శాఖల అధికారులతో సీఎస్ సమీక్ష నిర్వహించారు. మహిళ శక్తి క్యాంటీన్ల పనితీరు, నిర్వహణ, అవసరమైన స్థలం తదితర వివరాలతో రోడ్ మ్యాప్ తయారు చేయాలని గ్రామీణాభివృద్ధి, పంచాయితీరాజ్ శాఖ కమిషనర్‌ను సీఎస్ ఆదేశించారు.




## నిజమైన సాగుదారుకే సాయం

హైదరాబాద్ : గత సర్కారు హయాంలో సాగులో లేని పడావు భూములు, గుట్టలు, ఇటుక బట్టీలు, రోడ్లు, నాన్ లే ఔట్ వెంచర్లకు ఇచ్చిన పెట్టుబడి సాయం ఇక మీదట ఆగిపోనుంది. వ్యవసాయం చేయడానికి వీల్లేని ఇలాంటి భూములకు గత సర్కారు పెట్టుబడి సాయం ఇవ్వడంపై సామాన్య ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వ్యవసాయ యోగ్యమైన భూములకే రైతు భరోసా ఇచ్చేందుకు కాంగ్రెస్ సర్కారు కసరత్తు చేస్తోంది. వానాకాలం సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ అనర్హుల లెక్క తేల్చే పనిలో పడింది.

పాస్ పుస్తకాలు కలిగిన గుట్టలు, రహదారులు, కాల్వలు, ఫామ్ వెంచర్లు, నాన్ లేఔట్ ప్లాట్లు, పడావు భూములు, ఇటుక బట్టీలు, వ్యవసాయ భూముల్లో కొనసాగుతున్న పౌల్ట్రీ ఫామ్స్, ఇతర కమర్షియల్ అవసరాలకు వినియోగిస్తున్న వ్యవసాయ భూములను ఏఓలు, ఏఈఓలు ఐడెంటిఫై చేయనున్నారు. అనంతరం అనర్హులను గుర్తించి, రైతు భరోసా డేటా నుంచి తొలగించనున్నారు.

**5 శాతం భూములు పడావే...** ధరణి పోర్టల్ లో నమోదైన భూముల్లో 5 నుంచి 10 శాతం భూములు వ్యవసాయానికి యోగ్యం కాని భూములేనని తెలుస్తున్నది.

వ్యవసాయ అధికారులు పక్కాగా సర్వే చేస్తే హైదరాబాద్ చుట్టపక్కల ప్రాంతాలతోపాటు రాష్ట్రంలోని ముఖ్య నగరాలు, పట్టణాల చుట్టూ రెండు, మూడు దశాబ్దాల క్రితం ప్లాట్లు గా చేసిన భూములు , వెంచర్లు కలిపి సుమారు 3 లక్షల ఎకరాల వరకు తేలనున్నాయి. అలాగే గుట్టలు, రహదారులు, పడావు భూములు, అక్రమంగా పట్టా చేసిన ప్రభుత్వ భూములు, ఫారెస్టు భూములు, ఇటుక బట్టీల లెక్క కూడా బయటపడనున్నది. ఇలాంటి భూములు కూడా మరో 2 లక్షల ఎకరాల వరకు తేలే అవకాశముందని అధికారులు చెప్తున్నారు.

**రైతుభరోసా.. ఐదెకరాలా? పదెకరాలా ?...** రాష్ట్రంలో 68.99 లక్షల మంది రైతులకు 1.52 కోట్ల ఎకరాల భూమి ఉన్నట్టు రెవెన్యూ రికార్డులు వెల్లడిస్తున్నాయి. గత యాసంగి సీజన్ లో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రైతు భరోసా లెక్కల ప్రకారం.. ఎకరంలోపు ఉన్న రైతులు 24,24,870 మంది ఉండగా.. వారి వద్ద 13.57 లక్షల ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అలాగే 2 ఎకరాల్లోపు ఉన్న రైతులు 17,72,675 మంది ఉండగా.. వారి వద్ద 26.58 లక్షల ఎకరాలు ఉన్నాయి. మొత్తంగా ఐదెకరాల్లోపు ఉన్న రైతులు రాష్ట్రంలో 64,75,320 మంది ఉండగా, వారి వద్ద 1,11,49,534 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది.

వాస్తవానికి గత వానాకాలం సీజన్ లో ఐదెకరాల్లోపు ఉన్న రైతులు 62 లక్షల మంది ఉండగా, వారి చేతిలో కోటి ఎకరాల భూమి ఉంది. కానీ గత కొద్ది నెలల్లోనే ఐదెకరాల్లోపు ఉన్న రైతులు సుమారు 2 లక్షల మంది పెరిగారు. ఐదెకరాల్లోపు ఉన్న రైతుల చేతిలో భూమి కూడా మరో 10 లక్షల ఎకరాల మేర పెరగడం విశేషం. రైతుభరోసాపై పరిమితి విధిస్తారనే ప్రచారం నేపథ్యంలోనే పదెకరాలకుపైగా ఉన్న రైతులు తమ కుటుంబ సభ్యుల పేరిట ఐదెకరాల చొప్పున ధరణిలో రిజిస్ట్రేషన్ చేయించినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం 4 లక్షల మంది వద్ద సుమారు 40 లక్షల ఎకరాల భూమి ఉంది. రైతు బంధును ఐదెకరాలకే పరిమితం చేస్తారా? లేదా పదెకరాలలోపు వారికి అమలు చేస్తారా? అనేది త్వరలోనే తేలనుంది.

**సంపన్నులకు రైతు భరోసా కట్!** గత సర్కార్ హయాంలో వ్యవసాయ భూములు కలిగి ఉన్న కోటీశ్వరులైన బడా కాంట్రాక్టర్లు, వ్యాపారులు, ఉన్నతాధికారులకు రైతుబంధు అందిన విషయం తెలిసిందే. ఎలాంటి నిబంధనలు విధించకుండా, లిమిట్ పెట్టకుండా వ్యవసాయ భూమి ఉన్న ప్రతి ఒక్కరికీ పెట్టుబడి సాయం అందిం చడంతో ఈ స్కీమ్ అభాసుపాలైంది. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక మొదటి బడ్జెట్ సమావేశా ల్లోనే వందల ఎకరాలు ఉన్న భూస్వాములు, సెలబ్రిటీలు, సినీ, రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, కోట్లాది రూపాయల ఆస్తులు ఉన్నవారికి రైతు భరోసా ఇవ్వొద్దని నిర్ణయించిన విషయం తెలిసిందే. నిజమైన సాగుదారుకే, వాస్తవ సాగుభూమికే రైతు భరోసా అందేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## మోడీకి భారీ షాక్ ఇచ్చిన ఆరెస్సెస్ ?

బీజేపీకి పునాది రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్. ఆరెస్సెస్ నుంచి వచ్చిన అనేక అంగాలలో రాజకీయ అంగమే బీజేపీ. దేశంలో తమదైన భావజాలంతో ఒక రాజకీయ పార్టీ ఉండాలని అధికారం అందుకోవాలని ఆరెస్సెస్ భావించింది. దాని ఫలితంగా 1925లో ఆరెస్సెస్ ఏర్పాటు అయితే ఆ తరువాత పాతికేళ్ల తరువాత బీజేపీ ఆవిర్భావం జరిగింది. నెహ్రూ మంత్రివర్గంలో బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ శ్యామ్ ప్రకాష్ ముఖర్జీ జనసంఘ్ ని స్థాపించారు. వ్యవహారికంగా జనసంఘ్ అని పిలువబడే భారతీయ జనసంఘ్ పార్టీని 1951 అక్టోబర్ 21న ఢిల్లీలో స్థాపించారు. జనసంఘ్ నుంచే అటల్ బిహారీ వాజ్ పేయి, లాల్ కృష్ణ అద్వానీ లాంటి నాయకులు ప్రముఖ పాత్ర వహించారు. అయితే 1977లో ఈ పార్టీని జనతా పార్టీలో విలీనం చేశారు. జనతా ప్రభుత్వం 1979లో కుప్ప కూలడంతో భారతీయ జనతా పార్టీని వాజ్ పేయి స్థాపించారు. ఇదంతా ఎందుకు అంటే నాటి జనసంఘ్ కానీ తరువాత వచ్చిన బీజేపీ కానీ ఆరెస్సెస్ డైరెక్షన్ లోనే పనిచేస్తూ వచ్చాయి. ప్రధాని వంటి ఎంతటి ఉన్నత హోదాలో ఉన్నా ఆరెస్సెస్ సూచనలు సలహాలు తీసుకుని పనిచేసేవారు. అలాంటి ఆరెస్సెస్ నుంచే నరేంద్ర మోడీ కూడా వచ్చారు. అయితే మోడీ 2014లో ప్రధాని అయ్యాక బీజేపీలో వ్యక్తి పూజ అధికం అయింది అన్న భావన ఏర్పడింది. బీజేపీ వంటి సంస్థాగతంగా బలమైన పార్టీలో వ్యక్తులకు ప్రాధాన్యత చాలా తక్కువ. పార్టీదే అగ్ర స్థానం. కానీ గడచిన ఎన్నికలు అన్నీ మోడీ ఇమేజ్ తోనే సాగాయి. రెండు సార్లు బీజేపీకి పూర్తి మెజారిటీ దక్కడంతో ఆరెస్సెస్ కూడా ఏమీ అనలేకపోయింది. కానీ ఈసారి చూస్తే బీజేపీ 240 సీట్ల వద్ద పడిపోయింది. కీలక రాష్ట్రాల్లో పార్టీ దెబ్బ తింది. యూపీలో 80 ఎంపీ సీట్లు ఉంటే బీజేపీకి దక్కినవి అక్షరాలా 32 మాత్రమే. దాంతో బీజేపీ లో ఏమి జరుగుతోంది అన్న చర్చ మొదలైంది. ఈ నేపధ్యంలో మాతృ సంస్థ అయిన ఆరెస్సెస్ మోడీ మీద ఇండైరెక్ట్ గానే కామెంట్స్ చేసింది. ఆరెస్సెస్ తన సొంత పత్రిక ఆర్గనైజర్ లో బీజేపీ నడక మీద పార్టీ పెద్దల పనితీరు మీద నిశితంగా విమర్శించింది. మితిమీరిన విశ్వాసంతో ఉన్న బీజేపీ నేతలకు ఈ ఎన్నికల ఫలితాలు గట్టిగానే బుద్ధి చెప్పాయని ఆరెస్సెస్ పేర్కొనడం అంటే అది మోడీకి షాక్ లాంటి స్టేట్మెంట్ అనే అంటున్నారు. బీజేపీ కార్యకర్తలు చాలా మంది మోడీ ఇమేజ్ ని ఆయన క్రేజ్ ని చూసి సంతోషించారు తప్ప దేశంలోని ప్రజల గొంతుకను ఏ మాత్రం వినిపించుకోలేదని ఆరెస్సెస్ తీవ్రంగానే విమర్శించింది. ఆరెస్సెస్ వాలంటీర్ల సాయం కూడా బీజేపీ తీసుకోలేదు అని ఆక్షేపించింది. మొత్తానికి బీజేపీ రాజకీయ పోకడలు ఒంటెద్దు విధానాల పట్ల సరైన సమయంలోనే ఆరెస్సెస్ పెదవి విప్పి గట్టిగానే రియాక్ట్ అయింది. 400 పార్ అని ప్రధాని మోడీ ఇచ్చిన నినాదాన్ని పార్టీ కార్యకర్తలు నేతలే సీరియస్ గా తీసుకోలేదు అని ఆరెస్సెస్ హాట్ కామెంట్స్ చేసింది. మొత్తానికి చూస్తే ఆరెస్సెస్ తీవ్ర అసంతృప్తితో ఉందని అర్ధం అవుతోంది. బీజేపీ సాధించిన ఈ ఫలితాలు గుణపాఠం అని కూడా చెప్పడం చూస్తే బీజేపీ ప్రక్షాళనకు ఆరెస్సెస్ సిద్ధపడుతుంది అని అంటున్నారు. తొందరలో బీజేపీ జాతీయ అధ్యక్షుడిని కూడా ఆరెస్సెస్ బ్యాక్ గ్రౌండ్ ఉన్న వారికే ఎంపిక చేస్తారని అంటున్నారు. అలాగే ఇక మీదట బీజేపీ ప్రభుత్వ పనితీరుని కూడా క్లోజ్ గా మోనిటరింగ్ చేస్తారు అని అంటున్నారు. గత రెండు సార్లూ పూర్తి మెజారిటీ వచ్చిన నేపధ్యంలో ఆరెస్సెస్ ని పెద్దగా పట్టించుకోకపోయినా ఈసారి మాత్రం ఆరెస్సెస్ చెప్పినట్లుగా వినాల్సిన అవసరం అయితే బీజేపీ పెద్దలకు ఉందని అంటున్నారు. మొత్తానికి ఆరెస్సెస్ చేసిన ఈ హాట్ కామెంట్స్ ని బీజేపీ పెద్దలు ఎలా తీసుకుంటారో చూడాల్సి ఉంది. అదే విధంగా రానున్న రోజులలో ఆరెస్సెస్ తన పట్టుని బిగించే అవకాశాలు సుస్పష్టంగా ఉన్నాయని అంటున్నారు.

# అధ్వాన రహదారులు బాగయ్యేనా..!



కరీంనగర్ :పూర్తిగా తారు తేలిపోయి కనిపిస్తున్న రహదారి మానకొండూరు నుంచి వెల్ది వెళ్లే మార్గం. ఏడాదిన్నర కాలంగా ఇక్కడ ఇదే దుస్థితి నెలకొంది. వాహనదారులు ఈ రహదారిపై వెళ్లలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు దుస్థితి అధ్వానంగా ఉండటంతో ప్రత్యామ్నాయ మార్గాన్ని చూసుకుంటున్నారు. వెల్ది నుంచి రంగపేట మీదుగా మార్గాన్ని ఎంచుకుని అటు నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటి వరకు దీనికి మరమ్మతులు చేపట్టలేదు. ఈ చిత్రంలో కనిపిస్తున్నది పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ – పొత్కపల్లి మార్గంలోని రహదారి. చాలా కాలంగా రోడ్డుపై ఉన్న తారు తేలిపోయి గుంతలమయంగా మారింది. నిత్యం వివిధ ప్రాంతాలకు వెళ్లే వారు ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. గుంతలతో నిండి ఉన్న ఈ రోడ్డుపై ప్రయాణం చేయడం నరకమే. గతంలో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రహదారి ఇప్పటికీ మరమ్మతుకు నోచుకోలేదు. నిధులు లేవనే కారణంతో మూడేళ్లుగా ఎలాంటి పనులు చేపట్టలేదు. మూడేళ్లుగా ఇదే స్థితిలో ఉంది. కొత్తగా మంజూరైన నిధులతో దీనికి మోక్షం లభిస్తుందని స్థానిక ప్రజలు ఆశిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో అధ్వానంగా ఉన్న ఇలాంటి రహదారులు ఎన్నో ఉన్నాయి. ప్రయాణానికి అనుకూలంగా లేనివి, వర్షాలకు దెబ్బతిన్నవి.. మరమ్మతులకు నోచుకోని వాటిపై అనేక సార్లు అధికారుల నుంచి ప్రతిపాదనలు వెళుతున్నా నిధుల మంజూరు లేక పరిస్థితిలో మార్పు కనిపించడం లేదు. అక్కడక్కడా అరకొర నిధులతో పనులు చేపడుతున్నా అవి సరిపోక మధ్యలోనే నిలిచిపోయే పరిస్థితి. ఉమ్మడి జిల్లా పరిధిలో 942 కిలోమీటర్ల మేర రహదారులు ధ్వంసమైనట్లు అధికారులు గుర్తించారు. వాటి మరమ్మతులు.. నిర్మాణానికి రూ.324 కోట్లతో అంచనాలు వేశారు. గతంలోనే ఈ ప్రతిపాదనలు చేశారు. వాటిలో కొన్ని పనులు పూర్తి చేసినా ఇంకా చాలా వరకు పెండింగ్‌లో ఉన్నాయి. తాజాగా కేంద్ర ప్రభుత్వం రూ.850 కోట్లు రహదారుల కోసం రాష్ట్రానికి కేటాయించింది. ఒక్కో జిల్లాకు రూ.20 కోట్ల నుంచి రూ.25 కోట్ల వరకు కేటాయించి పనులు చేపట్టాలని రహదారులు భవనాల శాఖ అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా పరిధిలో రహదారులు మెరుగుపడే అవకాశం ఉందని వాహనదారులు భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రహదారులపై దృష్టి సారించడంతో కేంద్ర ప్రభుత్వ నిధులతో కొంత వరకు పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉంది. ఎక్కడ అత్యవసరం.. ఏ మార్గంలో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారన్న విషయాలను గుర్తించి తదనుగుణంగా అధికారులు ప్రణాళికలు చేస్తున్నారు.

**ఉమ్మడి జిల్లాలో అధ్వానంగా ఉన్న మార్గాలు కొన్ని**

మంథని మండలంలోని మంథని– ఓడెడు రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించారు. రూ.20 కోట్లతో రహదారి నిర్మించేందుకు ప్రణాళికలు చేశారు. దీంతో పాటు ఓడెడు వంతెన నిర్మాణానికి నిధుల కోసం అంచనాలు తయారు చేశారు.

కరీంనగర్ జిల్లాలోని మానకొండూరు మండలంలో కెల్లెడ – రంగపేట రహదారికి పూర్తి అధ్వానంగా మారింది. రంగపేట ఎక్స్ రోడ్డు నుంచి రంగపేట వరకు వాహనాలు నడిచే పరిస్థితి లేదని చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సిరిసిల్ల జిల్లా కొదురుపాక నుంచి నందిగామ వరకు నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు. వట్టిమల్ల రోడ్డు నిర్మాణానికి అంచనాలు రూపొందించారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలోని వన్‌పల్లి రహదారి పూర్తిగా దెబ్బతింది. ఈ రహదారి నిర్మాణానికి మోక్షం లభించడం లేదు.

**ప్రతిపాదనలు రూపొందించాం**

రహదారుల నిర్మాణం, మరమ్మతుల కోసం ఇది వరకే ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడుతాం. ఎక్కడెక్కడ రహదారులు దెబ్బతిన్నాయి. వాటిని మరమ్మతులు చేయవచ్చా.. పూర్తిగా కొత్తగా నిర్మించాలా అన్న విషయాలను పరిశీలించాల్సి ఉంది. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తే నిర్మాణాలకు సంబంధించిన ప్రక్రియ చేపడతాం.– ఇమామొద్దీన్, డీఈ,రహదారులు భవనాల శాఖ, పెద్దపల్లి

# ఓబీ మట్టి కుప్పలపై సామూహిక వనాలు



గోదావరిఖని: పర్యావరణ పరిరక్షణకు సింగరేణి పాటుపడుతోంది. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో భారీ ఎత్తున మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షిస్తోంది. సింగరేణి సంస్థ ప్రతిఏటా జూన్, జులై మాసాల్లో మట్టి కుప్పలతో పాటు పరిసర ప్రాంతాల్లో సామూహిక వనాలను పెంపొందిస్తోంది. ఇప్పటికే కోట్ల మొక్కలు నాటి వనాలుగా తయారు చేసిన సింగరేణి ఈ ఏడాది కూడా రామగుండం ప్రాంతంలో 10.46 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఉపరితల గనుల ద్వారా వెలికి తీసిన మట్టికుప్పలపై 86 హెక్టార్లతో పాటు మరో 220.6 హెక్టార్లలో సామూహిక వనాలను పెంచడంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టేందుకు సిద్ధమైంది. ఇందుకోసం గోదావరిఖని, సెంటినరీకాలనీలోని ఆర్జీ–1, 3 ప్రాంతాల్లోని నర్సరీల్లో భారీ ఎత్తున మొక్కలను పెంచుతోంది. రహదారులకు ఇరువైపులా వాటిని నాటేందుకు నిర్ణయించింది. ఇది వరకే రాజీవ్‌రహదారికి ఇరువైపులా పెద్దపల్లి నుంచి కరీంనగర్ వరకు మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తుండగా ప్రధాన రహదారుల పక్కన కూడా ఈసారి మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతలు తీసుకుంది.

**దుమ్ము ఎగిసిపడకుండా...**

రామగుండం ప్రాంతంలో భారీ ఎత్తున ఉన్న మట్టి కుప్పలపై మొక్కలు నాటడం వల్ల వాటిలోంచి దుమ్ము ఎగిసిపడకుండా ఉంటుంది. ఈ ప్రాంతంలో నాలుగు ఉపరితల గనుల ద్వారా సింగరేణి బొగ్గు ఉత్పత్తి చేస్తోంది. ఓసీపీ–1, 2, 3, 5 గనుల తవ్వకాల ద్వారా ఏర్పాటు చేసిన మట్టి డంపులపై మొక్కలు నాటడం వల్ల బొగ్గు ధూళి, మట్టి ధూళి పైకి ఎగిసిపడకుండా ఉంటుంది.

**పలు రకాలు...**

నీడనిచ్చే మొక్కలతో పాటు పండ్ల మొక్కలను సింగరేణి సంస్థ నర్సరీల్లో పెంచుతోంది. వీటిని వివిధ ప్రాంతాల్లో నాటేందుకు ఏర్పాట్లు చేసుకుంది. వనాల మాదిరిగా ఒకేచోట పెద్ద మొత్తంలో నాటి చుట్టూ కంచె ఏర్పాటు చేస్తుంది. అడవి మాదిరిగా మొక్కలు పెరిగి పెద్ద వృక్షాలుగా మారేందుకు సంరక్షణ చర్యలు చేపడుతోంది. వెదురు, వేప, ఉసిరి, నేరేడు, పులిచింత, మారేడు, నారేప, వెలగ మొక్కలను పెంచుతోంది. వీటితో పాటు నిమ్మ, మామిడి, అల్లనేరేడు, సీతాఫలం లాంటి మొక్కలను కూడా పెంచి కార్మిక కుటుంబాలకు ఇళ్లలో నాటేందుకు అవసరం ఉన్న వారికి పంపిణీ చేసేలా చర్యలు చేపడుతున్నారు.

**వర్షాలు కురవగానే నాటేందుకు ఏర్పాట్లు**


వర్షాలు కురవగానే మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేశాం. ప్రస్తుతం నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. ఉపరితల గనుల ఓబీ డంప్‌యార్డులపై వృక్ష జాతికి చెందిన మొక్కలు నాటుతాం. వనాలను పెంపొందించేందుకు వెదురు, కానుగ లాంటి మొక్కలు నాటి సంరక్షిస్తాం. మొక్కలు నాటేందుకు ప్రాంతాలను గుర్తించి ఏర్పాట్లు చేస్తున్నాం.డేవిడ్ అభిలాష్, సింగరేణి అటవీ విభాగం అధికారి

# ఆక్రమణలో 640 ఎకరాలు

భువనగిరి : ఆత్మకూర్(ఎస్) మండలం కందగట్ల శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవాలయానికి చెందిన సుమారు 640 ఎకరాల దేవుని మాన్యం భూములు దశాబ్దాల తరబడి ఆక్రమణకు గురవుతున్నాయి. ఈ గ్రామంలో 591 సర్వే నంబరుతో ప్రారంభమయ్యే దేవునిమాన్యం 703 సర్వేనంబర్ల వరకు విస్తరించి ఉంది. 71, 72, 73 సర్వే నంబర్లలోనూ కొద్ది విస్తీర్ణంలో దేవుడి భూమి ఉంది. కిచ్చనపాడు చంద్రిక పేరుతో పట్టా ఉన్న ఈ భూములపై ఇప్పటి వరకు వేలం పాటలు నిర్వహించిన దాఖలాలు లేవు. ఒకవేళ నిర్వహించాలని ప్రయత్నం చేసినా గొడవలు జరిగిన సందర్భాలున్నాయి. పైగా ఆలయ భూముల్లోనే ఇళ్లతోపాటు ఇతర నిర్మాణాలు వెలుస్తున్నాయి. ప్రభుత్వానికి నయాపైసా ఆదాయం రావడం లేదు.

**నోటీసులు ఇచ్చినా స్పందన శూన్యం**

కందగట్ల గ్రామ శివారులోని మంగళితండా, వీర్యానాయక్‌తండా, జాజిరెడ్డిగూడెం మండలం లోయపల్లి, నూతనకల్ మండలం బక్కహేమ్లాతండా తదితర గ్రామాల పరిధిలో ఈ దేవుని మాన్యం విస్తరించి ఉంది. ప్రస్తుతం ఆ భూములన్నీ ఆక్రమణదారుల కబంధ హస్తాల్లో చిక్కుకున్నాయి. ఇటీవల దేవుని మాన్యం భూములను రైతులకే లీజుకిచ్చి కౌలు వసూలు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. దీనిలో భాగంగా దేవాదాయ, ధర్మాదాయశాఖ అధికారులు జిల్లాలోని దేవుని మాన్యం భూములున్న చోట లీజు నోటీసులు జారీ చేస్తున్నారు. కందగట్ల శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయ భూములకు సైతం నోటీసులు జారీ



చేశారు. మే చివరి వారంలో గ్రామసభలు నిర్వహించి ఆయా గ్రామాల రైతులతో చర్చలు జరిపారు. గత కొన్నేళ్లుగా రైతులే అక్రమంగా సేద్యం చేస్తున్నారని, ఈసారి కౌలు చెల్లించాలని స్పష్టంచేశారు. అయినా రైతుల్లో స్పందనలేదు. మరోవైపు తాత, ముత్తాతల కాలం నుంచి కబ్జాలో ఉంటూ వ్యవసాయం చేసుకుంటున్నామని, తమకు అధికారికంగా పట్టాలు ఇప్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

**ధూపదీప నైవేద్యానికి పాట్లు**

2018 నుంచి ఈ ఆలయానికి పాలక మండలి లేదు. వందల ఎకరాల భూములకు కౌలు రావడం లేదు. ఆదాయం లేకపోవడంతో ఆలయంలో ధూపదీప నైవేద్యం కరవవుతోంది. దాతల సాయంతోనే ఆలయంలో అప్పుడప్పుడు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

# విలీన గ్రామాలకు పాత పన్నులే..!

సూర్యాపేట : పురపాలికల్లో విలీనమైన గ్రామాలకు శుభవార్త. జిల్లాలోని పురపాలికలకు నిర్వహణ భారంతో పాటు ఉద్యోగుల వేతనాలు, తదితర వాటి ఖర్చులు ఏటా పెరుగుతున్నా.. విలీన గ్రామాలపై భారం పడకుండా చర్యలు తీసుకుంటున్నారు. వారి నుంచి పాత పన్నులే వసూలు చేయనున్నారు. జిల్లాలోని సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, తిరుమలగిరి, నేరేడుచర్ల పురపాలికల్లో ఏటా రూ.27.65 కోట్ల పన్ను డిమాండ్ ఉంటుంది. వీటిలో రూ.7 కోట్ల వరకు విలీన ప్రాంతాల నుంచి వస్తున్నాయి. 2021లో భువన్ సర్వే చేపట్టి పురపాలికల్లో ఆస్తులకు సంబంధించిన వివరాలు సేకరించింది. విలీన గ్రామాల ప్రజల నుంచి పాత రేటు ప్రకారమే పన్నులు వసూలు చేస్తున్నారు. వీటిని ప్రస్తుత రేట్ ప్రకారం వసూలు చేస్తే వారిపై రెట్టింపు భారం పడుతుంది.



**ముగిసిన గడువు**

జిల్లాలోని ఐదు పురపాలికలకు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాలను 2018లో అప్పటి ప్రభుత్వం విలీనం చేసింది. సూర్యాపేట పురపాలికలో కుడకుడ, రాయినిగూడెం, పిల్లలమర్రి, కుప్పిరెడ్డిగూడెం, కుసుమవారిగూడెం, దురాజ్‌పల్లి, బీబీగూడెం, బాషానాయక్‌తండా, గాంధీనగర్, కోదాడ పరిధిలో కొమరబండ, తమ్మర, నేరేడుచర్లలో రామాపురం, నర్సయ్యగూడెం, రామగిరి, తిరుమలగిరి పురపాలికలో మాలిపురం, నందాపురం, అనంతారం గ్రామాలు విలీనమయ్యాయి. విలీనమైన రోజు నుంచి మూడేళ్ల వరకు పెన్నులు పెంచొద్దని గత ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. 2021తోనే విలీన గ్రామాల గడువు ముగిసింది. కానీ పన్నులు పెంచలేదు. ఈ సంవత్సరం కూడా పెంచడం లేదు. 'విలీన గ్రామాలపై పన్ను పెంపుపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు రానందున పెంచడం లేద'ని సూర్యాపేట పుర కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు.

# టెండరు దాటని చెత్తశుద్ధి

నల్గొండ : ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని 19 పురపాలికల డంపింగ్ యార్డుల్లో కొన్నేళ్లుగా వ్యర్థాలు గుట్టలుగుట్టలుగా పేరుకుపోతున్నాయి. పరిసర ప్రాంతాల ప్రజలు దుర్వాసనతోపాటు గాలి కాలుష్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటూ రోగాల బారిన పడుతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు గత భారాస ప్రభుత్వం పురపాలికల్లో బయోమైనింగ్ ప్లాంటు నిర్మించేందుకు నిర్ణయించింది. రాష్ట్ర స్థాయిలో 2022లో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసింది. అందులో భాగంగా నల్గొండలో ఓ గుత్తేదారు సంస్థ ప్లాంటు నిర్మాణ పనులు ప్రారంభించి మధ్యలోనే నిలిపివేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు అడుగు ముందుకు పడలేదు. నిర్మాణ పనులు ఆరంభ శూరత్వంగా మిగిలిపోయాయి.

**కార్యరూపం దాల్చక పాట్లు**

పట్టణాల్లో నిత్యం 450 టన్నులకు పైగా ఉత్పత్తి అవుతున్న చెత్తను పారిశుద్ధ్య కార్మికులు సేకరించి వాహనాల ద్వారా డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు. ఆయా కేంద్రాల్లో సుమారు 2లక్షల మెట్రిక్ టన్నులకు పైగా నిల్వ ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. కొన్ని పురపాలికల్లో డంపింగ్ యార్డులు నిండిపోవడంతో పోగైన వ్యర్థాలను దహనం చేస్తున్నారు. దీంతో వాతావరణం కలుషితమవుతోంది. పరిసర ప్రాంతాల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. పారిశుద్ధ్యం మెరుగు కోసం వెచ్చిస్తున్న రూ.కోట్లు వృథా అవుతున్నాయి. స్థలం సరిపడక వ్యర్థాలను నిల్వ చేయడం కష్టంగా మారుతోంది. బయోమైనింగ్ అందుబాటులోకి వస్తే చెత్త నిల్వలను కనుమరుగు చేయవచ్చని అధికారులు భావించినా.. కార్యరూపం దాల్చకపోవడంతో సమస్య మరింత జటిలంగా మారింది.

**టెండర్ల ప్రక్రియ ఎప్పుడో.!**

ఒక్కొక్క పురపాలిక సామర్థ్యాన్ని అనుసరించి బయోమైనింగ్ ప్లాంటు కోసం రూ.2 కోట్ల వరకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రెండేళ్ల నుంచి అ నిధులు పురపాలికల బ్యాంకు ఖాతాల్లో మూలుగుతున్నాయి. గుత్తేదారు సంస్థను వివిధ కారణాలతో బ్లాక్‌లిస్టులో పెట్టి టెండర్లు రద్దు చేసినట్లు తెలిసింది. ఈ తరుణంలోనే రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు దీరింది. కొత్త ప్రభుత్వం పురపాలికల్లో నిల్వ ఉన్న వ్యర్థాలపై దృష్టి సారించి బయోమైనింగ్ కోసం కొత్తగా టెండర్ల ప్రక్రియ ప్రారంభించాల్సి ఉంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం– ముసాబ్ అహ్మద్ సయ్యద్, కమిషనర్, నల్గొండ పురపాలికబయోమైనింగ్ ప్లాంటు ఏర్పాటుకు టెండర్లు నిర్వహించే అంశం రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టిలో ఉంది. త్వరలోనే టెండర్లు చేపట్టే అవకాశం ఉంది. ప్లాంటు ఏర్పాటైతే వ్యర్థాలను శుద్ధిచేయొచ్చు. ఆ తర్వాత కొత్తగా పోగయ్యే తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తాం. పొడి చెత్తను రీసైక్లింగ్ చేసేందుకు బెంగళూరుకు చెందిన ఐటీస్మీ సంస్థతో ఇప్పటికే చర్చలు పూర్తి చేశాం. తడి చెత్తను బయోగ్యాస్ ప్లాంటుకు అందిస్తాం.

# ఎస్సెల్బీసీపై ఆశలు చిగురింత

దేవరకొండ : నల్గొండ జిల్లా ప్రజల చిరకాల స్వప్నం ఎస్సెల్బీసీ టన్నెల్ ప్రాజెక్టు పనులను ఈ నెలలో ప్రారంభించేందుకు అధికారులు కసరత్తులు మొదలుపెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఎస్సెల్బీసీపై సీఎం రేవంత్‌రెడ్డి, నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జిల్లా ఎమ్మెల్యేలతో అనేక పర్యాయాలు ప్రాజెక్టుపై సమీక్ష జరిపారు. ప్రాజెక్టు పనులకు అవరోధం లేకుండా ఉండేందుకు నీటిపారుదలశాఖ అధికారులతో కమిటీ సైతం నియమించారు. ఈ మేరకు నీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జ ఇంజినీర్లు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో సమీక్ష జరిపి పనులు చేపట్టాలని వారికి అభయం ఇవ్వడంతో నిర్వాహకులు టన్నెల్ పనులకు ఈ నెలలో ప్రారంభించేందుకు ముహూర్తం కుదిర్చారు. ఔట్‌లెట్ వైపు ఉన్న టన్నెల్ బోరింగ్ మిషన్ బేరింగ్‌లు మరమ్మతులు ఏర్పడడం, నిధుల లేమితో 19 నెలలుగా పనులు నిలిచిపోయాయి. 2005లో ప్రారంభించిన పనులు తరచూ ఆటంకం నెలకొంటూ వస్తున్నాయి. 43.93 కిలోమీటర్లు టన్నెల్ తవ్వకాలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ 19 ఏళ్లు గడిచినా కేవలం 34.37 కిలోమీటర్లు పూర్తయింది. మిగిలిన 9.56 కిలోమీటర్లు తవ్వితే గ్రావిటీతో నీటిని ఉమ్మడి నల్గొండ జిల్లాలో 3 లక్షల ఎకరాలకు సాగునీరు, 516 ఫ్లోరైడ్ పీడిత గ్రామాలకు తాగునీరు అందించేందుకు వీలు అవుతుంది. అక్టోబరు కల్లా మరమ్మతులు పూర్తి చేసుకొని టీబీఎం మిషన్ సిద్ధంగా ఉంటుందని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
శుక్రవారం 14 జూన్ 2024

# ఏలికా..ఇవేం మెలికలు?

హైదరాబాద్ : నగరంలో సిటీ బస్సులు మెలికలు తిరుగుతున్నాయి. ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద జామ్ అవుతున్నాయని చెప్పి వాటిని మూసేసి యూటర్న్‌లు ఏర్పాటు చేశారు. అవి కూడా శాస్త్రీయంగా లేకపోవడమే కాదు.. ఒక్కో దగ్గర కిలోమీటరుకు పైగా(ఇరువైపులా కలిపి) ప్రయాణించాల్సి వస్తోంది. అక్కడ కూడా బస్సులు తిరిగేందుకు అవకాశం లేకపోవడంతో ఇతర వాహనాలకు ఇబ్బందిగా పరిణమిస్తుంది. నగరంలో మొత్తం 2,650 బస్సులు.. 36వేల ట్రిప్పులకు 7.5 లక్షల కిలోమీటర్లు తిరుగుతున్నాయి. ఇందులో కనీసం 72వేల కిలోమీటర్లకు పైగా యూటర్న్‌ల వల్ల అదనంగా తిరగాల్సి వస్తోందని ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ అధికారులు లెక్కలు వేశారు. దీంతో రోజూ ఇంధనానికి అదనంగా రూ.17.1లక్షలు వెచ్చించాల్సి వస్తోందంటున్నారు. ఈ లెక్కన నెలకు రూ.5.1కోట్ల అదనపు భారం పడుతోందని అంచనా వేస్తున్నారు.

మియాపూర్ మార్గంలోని ఆల్విన్ చౌరస్తాను మూసేశారు. కొండాపూర్ నుంచి ఆల్విన్ కాలనీ చౌరస్తాలో యూటర్న్ చేసుకుని వెనక్కి రావాల్సిన బస్సులు ఇప్పుడు బీహెచ్ఈఎల్ వైపు రానుపోను ఒకటిన్నర కిలోమీటర్లు తిరగాల్సి వస్తోంది. ఎల్బీనగర్, కొత్తపేట చౌరస్తాల వద్ద



కూడా యూటర్న్‌లతో 2కిలోమీటర్లు అదనంగా తిరగాల్సి వస్తోంది. ఇలా నగరవ్యాప్తంగా ఉన్న యూటర్న్‌లతో ఆర్టీసీ బస్సులు తిరిగే కిలోమీటర్లు అనవసరంగా పెరుగుతున్నాయని అధికారులు వాపోతున్నారు.

47ఎల్ రూటు నంబరు(మణికొండ-సికింద్రాబాద్) మధ్య తిరిగే బస్సు మూడు చోట్ల యూటర్న్ తీసుకోవాల్సి వస్తోంది. మణికొండ నుంచి సికింద్రాబాద్‌కు వస్తున్నప్పుడు.. ఉస్మానియా కాలనీ నుంచి పాత ముంబయి రహదారి, రాయదుర్గం పాత పోలీసు స్టేషన్ దగ్గర గతంలో సిగ్నళ్లు ఉండేవి. ఇప్పుడు వాటిని మూసేయడంతో గచ్చిబౌలి వైపు అర కిలోమీటరు ప్రయాణించి.. యూటర్న్ తీసుకుని అంతే దూరం వచ్చాక మహాప్రస్థానం రోడ్డులోకి రావాల్సి ఉంటుంది. తర్వాత జూబ్లీహిల్స్ రోడ్డునంబరు 45 వద్ద.. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైపు కిలోమీటరుకు పైగా ప్రయాణించి.. తిరిగి అంతే దూరం వెనక్కి వచ్చి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టుకు రావాల్సి వస్తోంది. సికింద్రాబాద్ నుంచి మణికొండకు వెళ్లినప్పుడు కూడా పాత ముంబయి రహదారి వద్ద ఇరువైపులా అర కిలోమీటరు చొప్పున ప్రయాణించి ఉస్మానియా కాలనీలోకి వెళ్లాల్సి వస్తోంది.

తగ్గిపోతున్న ట్రిప్పులు.. ఆలస్య ప్రయాణం

యూటర్న్‌ల వల్ల రోజులో ఒక షిఫ్టులో 5సార్లు వెళ్లి రావాల్సిన బస్సులు నాలుగుసార్లే వెళ్తున్నాయని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఇలా మ్యాన్ పవర్ వృథాతోపాటు ఒక్కో బస్సు రోజులో 2 ట్రిప్పులు కోల్పోతున్నాయని.. అంటే రోజుకు 70నుంచి 80 కిలోమీటర్ల చొప్పున 2,650 బస్సులకు మొత్తం 2లక్షల కిలోమీటర్ల ప్రయాణం తగ్గిపోతోందన్నారు. యూటర్న్‌ల వద్ద ట్రాఫిక్ జామ్‌తోపాటు ప్రమాదాలు జరుగుతున్నాయని.. డ్రైవర్లపై ఒత్తిడి పడుతోందంటున్నారు. యూటర్న్‌ల వద్ద రహదారి వెడల్పుగా ఉండేలా చూడాలని ఆర్టీసీ అధికారులు కోరుతున్నారు.

# ఆ నాలుగు సర్కిళ్లలోనూ గృహజ్యోతి

హైదరాబాద్ : ఎన్నికల కోడ్ ముగియడంతో రంగారెడ్డి జోన్ పరిధిలోని నాలుగు సర్కిళ్లలో కొత్తగా గృహజ్యోతి పథకం ప్రారంభమైంది. ఇక్కడ 200 యూనిట్లలోపు ఉన్న వినియోగదారులకు సున్నా బిల్లులు జారీ చేస్తున్నారు. సైబరాబాద్, సరూర్‌నగర్, రాజేంద్రనగర్, వికారాబాద్ సర్కిళ్లలో కలిపి 3.73 లక్షల మందికిపైగా వినియోగదారులు ప్రయోజనం పొందనున్నారు. గృహజ్యోతి పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా మార్చి నెలలోనే ప్రారంభించింది. మెట్రో జోన్ పరిధిలోని హైదరాబాద్ సెంట్రల్, సౌత్, బంజారాహిల్స్, సికింద్రాబాద్ సర్కిళ్లలో, మేడ్చల్ జోన్ పరిధిలోని హబ్సిగూడ, మేడ్చల్ సర్కిళ్లలో మార్చి నుంచే సున్నా బిల్లులు జారీ అవుతున్నాయి. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక, తర్వాత లోక్‌సభ ఎన్నికలు రావడంతో ఎన్నికల నియమావళి కారణంగా రంగారెడ్డి జోన్ పరిధిలో ఈ పథకం ప్రారంభం కాలేదు. కోడ్ ముగిసినట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించడంతో ఈనెల ఏడో తేదీ నుంచి గృహ వినియోగదా



రులకు సున్నా బిల్లులు ఇస్తున్నారు.

శివార్లలో ఎక్కువ మంది అర్హులు

గృహజ్యోతికి దరఖాస్తు చేసుకున్నవారిలో సైబర్‌సిటీ సర్కిల్‌లో 63,692 మంది అర్హులు ఉంటే.. సరూర్‌నగర్‌లో 93,516, రాజేంద్రనగర్‌లో 1,01,737 మంది వినియోగదారులకు ఈ నెల సున్నా బిల్లులు ఇస్తున్నారు. పూర్తి గ్రామీణ ప్రాంతమైన వికారాబాద్ సర్కిల్‌లో 1,14,455 మంది అర్హులుగా ఉన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకొని, ఆహారభద్రత కార్డు కలిగినవారికి ఈ పథకం వర్తింపజేస్తున్నారు. సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు-పి.ఆనంద్, సీజీఎం, రంగారెడ్డి జోన్, టీజీఎస్పీడీసీఎల్

అర్హత ఉండి గతంలో దరఖాస్తు చేసుకోలేనివాళ్లు, చేసుకున్నా సాంకేతిక కారణాలతో సున్నా బిల్లులు రానివారు జీహెచ్ఎంసీ ఏర్పాటుచేసే ప్రజాపాలన సేవాకేంద్రాల్లో గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఇది నిరంతర ప్రక్రియ. వాటిని పరిశీలించి అర్హులైనవారికి తదుపరి నెలలో సున్నా బిల్లులు జారీ చేస్తాం.

# రయ్..రయ్.. కాలనీరోడ్లకు సై



హైదరాబాద్: ఎన్నికల కోడ్ ముగియడంతో జీహెచ్ఎంసీ కాలనీ రోడ్లపై దృష్టిపెట్టింది. ఆరు జోన్ల పరిధిలో సుమారు వంద కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి సిద్ధమైంది. ఆయా సర్కిళ్ల కార్యనిర్వాహక ఇంజినీర్లు పనులకు సంబంధించి టెండర్లు పిలిచారు. రూ.5లక్షల నుంచి రూ.కోటి విలువైన పనులు అందులో ఉన్నాయి. పనులు సాకారమైతే చాలా సంవత్సరాలుగా గతుకుల రోడ్లతో సతమతమవుతోన్న నగరవాసులకు ఉపశమనం లభిస్తుంది. సీసీ రోడ్ల పనులతో పాటు..పారిశుద్ధ్యం, బహుళ అంతస్తుల పార్కింగ్ కాంప్లెక్సు, సీఆర్ఎంపీ(కాంప్రహెన్సివ్ రోడ్ మెయింటెనెన్స్ కార్యక్రమం), ఎస్సార్డీపీ(వ్యూహాత్మక నాలాల అభివృద్ధి కార్యక్రమం), ఎస్ఎన్‌డీపీ(వ్యూహాత్మక నాలాల అభివృద్ధి కార్యక్రమం) వంటి ఇతర పనులపైనా దృష్టిసారించారు.

ఇతర పనులకూ

వీధికుక్కలను పట్టి తెచ్చే వాహనాల గడువు ముగిసింది. దీంతో జోన్‌కు ఒకటి చొప్పున ఆరు బొలెరో వాహనాలను మూడు నెలల కాలానికి అద్దెకు తీసుకోవడం, వర్షాకాల అత్యవసర బృందాలు, నిర్వహణ పనులకు ఆరు జేసీబీ యంత్రాలు, ఇంటింటి చెత్త సేకరణకు మూడు రిక్షాలు, బుల్కాపూర్ నాలాల్లో పూడికతీతకు జీహెచ్ఎంసీ ఇంజినీర్లు టెండర్లు పిలిచారు.

ఏడాదిలో పార్కింగ్ కాంప్లెక్సు..

కేబీఆర్ పార్కు ప్రధాన ద్వారం సమీపంలో బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయాన్ని నిర్మించేందుకు జీహెచ్ఎంసీ టెండర్లు పిలిచింది. సొంతంగా కాంప్లెక్సును నిర్మించి, వాహనాల నుంచి అద్దె వసూలు చేసుకోవడం ద్వారా పీపీపీ పద్ధతిలో పార్కింగ్ కేంద్రాన్ని నిర్వహించేందుకు ఆసక్తి ఉన్న సంస్థలకు ఆహ్వానం పలికింది. టెండరు ప్రక్రియ విజయవంతమైతే కాంట్రాక్టరు జీహెచ్ఎంసీతో ఒప్పందం చేసుకున్న రోజు నుంచి ఏడాదిలో పార్కింగ్ కాంప్లెక్సు నిర్మాణాన్ని పూర్తి చేయాలి. 72 కార్లను పార్కింగ్ చేసేలా భవనాన్ని నిర్మించాలన్నది ప్రణాళిక. అందులో 20శాతం స్థలాన్ని ద్విచక్ర వాహనాలు నిలిపేందుకు కేటాయించనున్నారు.

అయినా ప్రశ్నార్థకమే..

ఏడాదిగా జీహెచ్ఎంసీలో సుమారు రూ.1,300కోట్ల బిల్లులు బకాయిలు పేరుకుపోయాయి. వాటిని చెల్లిస్తేనే కొత్తవి చేపడతామని ఇటీవల గుత్తేదారులు సమ్మెకు దిగారు. వర్షాకాలంలో చేపట్టాల్సిన అత్యవసర పనులకు మినహాయింపు ఇచ్చారు. ఇలాంటి పరిస్థితుల్లో జీహెచ్ఎంసీ కొత్తగా చేపట్టదలచిన పనులకు సహకరిస్తారా? లేదా? అనే ప్రశ్నలు రేకెత్తుతున్నాయి. ఉద్యోగులకు జీతాలు చెల్లించడమే కష్టంగా ఉన్న పరిస్థితుల్లో.. మూడేళ్లుగా అమలుకు నోచుకోని కాలనీ రోడ్ల నిర్మాణం పట్టాలెక్కుతుందాననే అనుమానాలు ఉన్నాయి. ఇంజినీర్లు మాత్రం నిధులకు ఢోకా లేదని, కమిషనర్ బకాయిల చెల్లింపుపై స్పష్టమైన హామీ ఇవ్వడంతో పనులు చేపట్టేందుకు ముందుకొచ్చారని చెబుతున్నారు.

# చినుకు పడితే.. వణుకే!



పరిగి : వానాకాలం ప్రారంభం అవుతుందంటేనే జిల్లా పట్టణ ప్రాంత వాసులు 'గతానుభవాల వరద ముప్పు' తలుచుకుని వణికిపోతున్నారు. చిన్నపాటి వర్షం పడినా వరదనీరు నేరుగా లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వచ్చేస్తోంది. కొన్నిచోట్ల నీరుపారే కాలువలు సరిగ్గా లేక ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. వర్షాలు ఇప్పుడిప్పుడే పడుతున్నాయి. మళ్లీ ప్రజలు అవస్థల పాలు కాకుండా అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై 'పరిశీలనాత్మక' కథనం.

దశాబ్దాల క్రితం నిర్మించినవి...

పరిగిలోని టీచర్స్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, ఖాన్ కాలనీల కంటే బీసీ కాలనీ పల్లపు ప్రాంతంగా ఉంది. వర్షపు నీరంతా సాఫీగా వెళ్లకపోవడం, ఎక్కువ లోతుగా ఉండటంతో నీరంతా అక్కడే నిలుస్తోంది. దశాబ్దాల క్రితం నిర్మించిన మురుగు కాల్వలు పెరిగిన జనాభా అవసరాలకు అనుగుణంగా చాలకపోవడం, పలుచోట్ల దెబ్బతినడంతో నీరంతా నేరుగా ఇళ్లలోకి చేరి తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. బీసీ కాలనీ రోడ్డు ఎంతపెంచడంలేదు.

సమస్య వచ్చినప్పుడే గుర్తుకొస్తుంది

జిల్లాలో వికారాబాద్, కొడంగల్, తాండూరు, పరిగి పురపాలక సంఘాలున్నాయి. వీటిలో తాండూరు, వికారాబాద్ పాతవి కాగా, మిగిలినవి ఏడేళ్ల క్రితం ఏర్పడినవి. భారీ వర్షాలతో వరదలు వచ్చి కాలనీలు ముంపునకు గురవుతున్న సమయంలోనే నేతలకు సమస్య గుర్తుకొస్తోంది. ఆ తరువాత మళ్లీ పట్టించుకోవడం లేదు.

వికారాబాద్ పురపాలక సంఘం పరిధిలోని రిక్షా కాలనీ, రామయ్య గూడ కాలనీ, గరీబ్‌నగర్, గృహకల్ప తదితర ప్రాంతాల్లో కొద్దిపాటి వర్షం పడినా చాలు ప్రజలు హడలి పోవాల్సిందే. రాజీవ్ గృహకల్పలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. పురపాలిక పరిధిలో నాలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతుండటంతో పారిశుద్ధ్య వ్యవస్థకు తీవ్ర విఘాతంగా మారుతోంది.

పాటు కాలువను పట్టించుకునే వారేరీ..

బాలాజీనగర్ కాలనీలో గల కుమ్మరివాడలో గత సంవత్సరం వర్షం నీరు ఇళ్లలోకి నీరు చేరింది. దీంతో ఇంట్లోని టీవీలు, ఫ్రిజ్‌లు, బియ్యం, జొన్నలు, రూ.లక్షల విలువైన కుమ్మరికుండలు ఇతర సామగ్రి పాడయ్యాయి. ఇందుకు ప్రధాన కారణం ఈ కాలనీ దూరంగా పెద్ద చెరువుకు వెళ్లే పాటుకాలువ తెగిపోవడం. దీంతో ఇళ్లు నీటమునిగాయి. అప్పట్లో కుమ్మరివాడలో నష్టపోయిన వారికి ఇళ్లు, నష్ట పరిహారం అందిస్తామని చెప్పి నేటికీ నెరవేర్చలేదు. అలాగే గాంధీనగర్‌లోని కొన్ని కాలనీల్లో మురుగు కాలువలు నిండి ఇళ్లలోకి మురుగు వస్తోందని పలుమార్లు గాంధీనగర్ వాసులు అధికారులకు తెలిపినా స్పందన కరవైంది.

వాగులను తలపించే రోడ్లు

తాండూరు పట్టణంలో వర్షం వస్తే పరిస్థితి వర్ణించలేం. భారీ వర్షం కురిస్తే తాండూరులోని కొన్ని కాలనీలు జలమయమవుతున్నాయి. వర్షం నీరు వెళ్లే దారి లేక రోడ్ల మీద వరదలా పారుతూ ఇళ్లలోకి చేరుతుంది. ప్రధానంగా పట్టణంలోని మిత్రానగర్, గ్రీన్‌సిటీ, అయ్యప్ప నగర్, భవానీనగర్, ఆదర్శ తులసీ నగర్ కాలనీలను వర్షం నీరు పెద్ద ఎత్తున ముంచెత్తుతుంది. ఆయా కాలనీల్లో మురుగు కాల్వల వ్యవస్థ సక్రమంగా లేక పోవటంతో వర్షా కాలంలో వరద ముప్పు తప్పడంలేదు. రోడ్ల మీద వరద నీరు పారి వాగులను తలపిస్తుంది. ఇళ్ల ముందు నిలిపిన వాహనాలు నీళ్లలో మునిగి పోతాయి. విద్యుత్ సరఫరా నిలిచి పోతుంది.

ఇవీ కారణాలు..

అస్తవ్యస్తంగా అంతర్గత రహదారులు.

శిథిలావస్థకు చేరిన మురుగు కాల్వలు.

చెత్తా, చెదారంతో పేరుకున్నా శుభ్రం చేయకపోవడం.

కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు నిలిచిపోవడం.

# చెత్త వేస్తే.. కెమెరా పట్టేస్తుంది

హైదరాబాద్: నగరంలో ప్రస్తుతం 2,300 చెత్త కుప్పలు ఉన్నాయి. ఇంటింటిలో చెత్త సేకరణకు 4,500 స్వచ్ఛ ఆటోలు రోజూ వెళ్తున్నాయి. అయినా ఏ వీధిలో చూసినా చెత్తకుప్పలే కనిపిస్తున్నాయి. ఈ చెత్తే భారీ వర్షాలు పడితే నాలాల్లోకి చేరి వరద ఉద్ధృతిని పెంచేస్తోంది. కాలనీలను ముంచెత్తుతోంది.ఇదేం కక్కుర్తి.. ఇంట్లో చెత్త తీసుకెళ్తే రూ.150 ఇవ్వాలి. వాళ్లు కూడా వారానికోరోజు వస్తారు. రాత్రి పూట వెళ్లి రోడ్డు పక్కన చెత్త వేస్తే సరిపోయే..అనుకొని చెత్తను పడేస్తున్న వారి సంఖ్య నగరంలో ఎక్కువగా ఉంది. ఇదే స్వచ్ఛతకు విఘాతం కలిగిస్తోంది.పరువు గోవిందా..: కొంతకాలంగా బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే రూ.1000 జరిమానా వేస్తామని జీహెచ్ఎంసీ అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు సీసీ కెమెరాలతో చెత్త వేసే వారిని పట్టుకుంటున్నారు. ఇక్కడ చెత్తవేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మైకుల్లో వచ్చేలా ఏర్పాటు చేస్తున్నారు.ఇదీ ప్రయోగం: ఎల్బీనగర్ సర్కిల్‌లోని ఉప్పల్ చిలకానగర్‌లో చెత్తకుప్పలను తొలగించి సీసీ కెమెరాలు, మైకులను ఏర్పాటు చేసి హెచ్చరిస్తున్నారు. ఇది విజయవంతమైంది. దీన్నే నగరమంతా అమలుచేయాలనుకుంటున్నారు.

నిధుల సమీకరణ ఇలా: సీసీ కెమెరాలు, మైకులకు కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులను సమీకరించాలని అనుకుంటున్నారు. దీనికి అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

# నకిలీ కన్సల్టెన్సీల నయామోసాలు

హైదరాబాద్: ఇంజినీరింగ్ పూర్తయి మూడేళ్లు దాటింది. మిత్రుడి సలహాతో కూకట్‌పల్లిలో కన్సల్టెన్సీను సంప్రదించాడు. ప్రముఖ కంపెనీలో పోస్టింగ్ ఇప్పిస్తాం.. హెచ్ఆర్‌ను దారిలోకి తెచ్చేందుకంటూ రూ.60వేలు తీసుకున్నారు. ఐదు నెలలైనా స్పందన రాకపోవటంతో నిలదీశాడు. అప్పట్నుంచి దిక్కున్నచోట చెప్పుకోమంటూ బెదిరింపు. ఏం చేయాలో పాలుపోక మధ్యవర్తి ద్వారా రూ.25వేలు రాబట్టుకొని వెళ్లిపోయాడు. అమీర్‌పేట్‌లోని ఓ శిక్షణ సంస్థ రెండేళ్లు అనుభవం ఉన్నట్టు ఒక యువకుడికి నకిలీ పత్రం సమకూర్చింది. దాని ద్వారా కొలువు సంపాదించిన అతడి పనితీరుపై అనుమానం వచ్చిన సంస్థ విచారణ చేయిస్తే వాస్తవం వెలుగు చూసింది. ఆరు నెలలుగా ఆ యువకుడు తీసుకున్న వేతనం తిరిగి చెల్లించాలని.. లేకుంటే కేసు నమోదు చేస్తామని చెప్పటంతో నగదు కట్టి బయటపడ్డాడు. బాధితుడికి నకిలీ సర్టిఫికెట్ ఇచ్చినందుకు ఆ కన్సల్టెన్సీ అతడి 4 నెలల వేతనం తీసుకోవడం కొసమెరుపు.

నెలలు.. ఏళ్లు తరబడి ఎదురుచూసిన యువత ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో కనిపించే ఉద్యోగ ప్రకటనలకు ఆకర్షితులవుతున్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా మోసపోయి పోలీసులను ఆశ్రయిస్తున్నారు. గ్రేటర్ పరిధిలోని మూడు పోలీసు కమిషనరేట్లలో ఏటా 500-600కు పైగా ఉద్యోగం/ఉపాధి అవకాశాల మోసాల కేసులు నమోదవుతున్నాయి. ఈ ఏడాది 5నెలల వ్యవధిలోనే 200లకు పైగా ఫిర్యాదులు వచ్చినట్టు గణాంకాలు చెబుతున్నాయి. తాజాగా ఎస్సార్‌నగర్ పరిధిలో ఒక ప్రయివేటు సంస్థ శిక్షణ ఉద్యోగాలు కల్పిస్తామంటూ యువతను ఆకట్టుకుంది. పలువురు యువకులు రూ.50-60వేలు చెల్లించి 6 నెలల శిక్షణ పూర్తిచేశారు. ఏడాదికి రూ.2-3లక్షల ప్యాకేజీతో కొలువు పక్కా అని లెక్కలు వేసుకున్నారు. వీళ్లు శిక్షణలో ఉండగానే సంస్థ



ప్రతినిధులు వీరి పేర్లతో క్రెడిట్‌కార్డులు/వ్యక్తిగత రుణాలు తీసుకున్నారు. ఈ సొమ్మును తాము వాడుకొని ఉద్యోగాల్లోకి చేరగానే వారి ఖాతాల్లో జమచేస్తామని నమ్మించారు. తరువాత ముఖం చాటేయటంతో బ్యాంకుల నుంచి యువతకు నెలవాయిదాలు చెల్లించాలంటూ నోటీసులు అందటం మొదలైంది. మోసపోయినట్టు గ్రహించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నకిలీ సంస్థ వెబ్‌సైట్‌ను అంతర్జాలం నుంచి తీసివేయించారు.

కాస్త ఆగమంటూ వాయిదాలు

గతేడాది అమెరికా, ఇంగ్లండ్‌లో నకిలీ కన్సల్టెన్సీ 150మంది యువకుల నుంచి రూ.2.5కోట్లు కాజేసి ముఖం చాటేసింది. తాజాగా సికింద్రాబాద్ పరిధిలో ఒక కన్సల్టెన్సీ విదేశాల్లో ఉద్యోగాలకు అవసరమైన సర్టిఫికెట్లు, పాస్టపోర్టు, వీసా సమకూర్చుతామంటూ ఒక విద్యాసంస్థకు రూ.3కోట్లకు టోకరా వేసింది. రెండేళ్లుగా ప్రాంగణ ఎంపికలు జరగట్లేదు. కార్పొరేట్ సంస్థలు కూడా నియామకాలు చేపట్టడం లేదు. వందశాతం ఉద్యోగాలంటూ శిక్షణ సంస్థలు రేపుమాపంటూ వాయిదాలేస్తున్నాయి. యువత నకిలీ సర్టిఫికెట్లతో ఏదో కంపెనీలో చేరుతున్నారు. పనితీరు సరిగా లేకపోవటంతో దొరికిపోతున్నారు.

# ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల్లో కదలిక వచ్చేనా?

కరీంనగర్ : ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, రామగుండం నగరపాలికలు, 14 పురపాలికలు, శాతవాహన పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలో ఎల్ఆర్ఎస్-2020 దరఖాస్తులను పరిశీలించి అనుమతి ఇచ్చేందుకు చర్యలు చేపట్టారు. 2020 అక్టోబరు 31 వరకు గత ప్రభుత్వ హయాంలో దరఖాస్తులు స్వీకరించారు. ఆ సమయంలో ఎలాంటి పత్రాలు సమర్పించకుండానే ఆన్‌లైన్‌లో రూ.వెయ్యి చెల్లించి వివరాలు నమోదు చేసుకున్నారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో 1,13,346 దరఖాస్తులు వచ్చాయి. అందులో 702 అర్జీలు మాత్రమే పరిష్కరించి, అనుమతులు జారీ చేశారు. ఫీజు చెల్లించాలని కోరుతూ 8,796 మందికి లేఖలు పంపించారు. మిగతావి పెండింగ్‌లో ఉన్నాయి. కరీంనగర్ సుడాలో 21,042 దరఖాస్తులు రాగా, 654 పరిష్కారానికి ఉండగా అయిదింటికి అనుమతులు ఇచ్చారు. వేములవాడ వీటీఏడీఏలో 3,873 అర్జీలు రాగా 183 పరిష్కారంలో ఉండగా ఇప్పటివరకు ఒక్క దానికి కూడా అనుమతి జారీ చేయలేదు. పర్యవేక్షణ నామమాత్రం..ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి జిల్లాకు ఒక ప్రత్యేకాధికారిని నియమించారు. పురపాలికల్లో పట్టణ ప్రణాళిక



అధికారులకు బాధ్యతలు అప్పగించారు. దరఖాస్తులను వేగంగా పరిశీలించాల్సి ఉండగా ఇతర విధుల కారణంగా అధికారులు అందుబాటులో ఉండటం లేదు. కొందరు ఫీజులు చెల్లిస్తామని, మరికొందరు చెల్లించిన వారు కార్యాలయాల వెంట తిరుగుతున్నారు. 24,267 దరఖాస్తులను ప్రాసెసింగ్ చేయగా వాటికి ఫీజు నిర్ణయించి అనుమతి ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే దరఖాస్తులు పరిష్కరించేలా ప్రత్యేక కార్యాచరణ తీసుకోవాల్సిన అవసరముంది.అనధికారిక ప్లాట్లు, అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్) పెండింగ్ దరఖాస్తులు వేగంగా పరిష్కరించాలని ఈనెల 7న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఇప్పటికే గడువు విధించగా సార్వత్రిక ఎన్నికల కారణంగా మళ్లీ మొదటికొచ్చింది. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కాగా, దరఖాస్తుదారులు మొదట్లో ఉత్సాహం చూపించారు. ప్రస్తుతం సమాచారం ఇచ్చినా కొందరు స్పందించడం లేదు. ఉమ్మడి జిల్లాలో దరఖాస్తుల పరిస్థితిపై కథనం.




## పుణె కారు ప్రమాదం కేసు: బయటపడుతున్న డాక్టర్ క్రిమినల్ నెట్‌వర్క్..!

మహారాష్ట్రలోని పుణెలో ఓ మైనరు (17) నిర్లక్ష్య డ్రైవింగు కారణంగా ఇద్దరు ఐటీ ఉద్యోగులు మృతిచెందిన కేసు దర్యాప్తులో కళ్లు బైర్లు కమ్మే వాస్తవాలు బయటపడుతున్నాయి. రక్త నమూనా మార్పిడికి పాల్పడిన డాక్టర్ సామాన్యుడు కాదు. అతడి వెనుక పెద్ద రాకెట్ నడుస్తోంది. ఇక తాజాగా నిందితుడి తండ్రి విశాల్ అగర్వాల్ ఏకంగా జువైనల్ జస్టిస్ బోర్డు ప్రాంగణంలోనే రూ. లక్షలు లంచం చెల్లించినట్లు గుర్తించారు. దీనికి సంబంధించిన సీసీ టీవీ దృశ్యాలను కూడా సేకరించారు. నిందితుడి రక్త నమూనాలను మార్చేందుకు ఈ సొమ్మును ససూన్ ఆస్పత్రి ప్యూన్ అతుల్ ఘాల్‌కాంబ్లే అనే వ్యక్తి వచ్చి తీసుకెళ్లినట్లు ధ్రువీకరించారు. మధ్యవర్తికి విశాల్ అగర్వాల్ డ్రైవర్ ద్వారా రూ. 4 లక్షలు అందజేశాడు. వీటిల్లో రూ.3 లక్షలను అతుల్‌కు చెల్లించారు. ఇప్పటికే ఆస్పత్రి ప్యూన్ పోలీసుల అదుపులో ఉన్నాడు. ఇక విశాల్ అగర్వాల్ దంపతులు, ఈ వ్యహారానికి మధ్యవర్తిగా వ్యవహరించిన అష్ఫాక్ మకాన్‌దార్ అనే వ్యక్తిని కూడా అరెస్టు చేశారు. అమర్ గైక్వాయిడ్ అనే వ్యక్తి కూడా మధ్యవర్తిగా వ్యవహరించినట్లు గుర్తించారు. ఈ కేసులో నిందితుడి రక్త నమూనాలను అతడి తల్లి బ్లడ్ శాంపిల్స్‌తో భర్తీ చేసిన విషయం తెలిసిందే.

**నాలుగు జిల్లాల్లో క్రిమినల్ రాకెట్..! :** ససూన్ ఆస్పత్రిలోని ఫోరెన్సిక్ విభాగం పనితీరుపై నీలినీడలు కమ్ముకొంటున్నాయి. ఈ విభాగం అధిపతి అయిన డాక్టర్ అజేయ్ తావ్‌డే గతంలో కూడా పలు కేసుల్లో ఇలానే రక్త నమూనాలు మార్చినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పుణె క్రైం బ్రాంచ్ అధికారులు కూడా ఇలాంటి అభిప్రాయాన్నే ఓ ఆంగ్ల వార్తా పత్రిక వద్ద వ్యక్తం చేశారు. తావ్‌డే నిందితుల రక్తనమూనాలు మార్చేయడం ఇదే తొలిసారి కాదని వారు పేర్కొన్నారు. ఇతడికి సంబంధించిన డాక్టర్లు, బ్రోకర్ల నెట్‌వర్క్ పుణె చుట్టుపక్కల పశ్చిమ మహారాష్ట్రలోని నాలుగు జిల్లాల్లో విస్తరించినట్లు వెల్లడించారు. ఏదైనా హైప్రొఫైల్ కుటుంబం మద్యపానం చేసి వాహనం నడిపినట్లు కేసు నమోదైతే.. ఈ నెట్‌వర్క్ ఆ కుటుంబాన్ని సంప్రదిస్తుంది. తర్వాత కొంత మొత్తం సొమ్ములు తీసుకొని రక్తనమూనాలు మార్చేసి.. స్వల్ప శిక్షలు పడేట్లు చేస్తుంది. కేసును బట్టి కనీసం రూ.5 లక్షలు వసూలు చేస్తారని చెబుతున్నారు. దాదాపు రెండేళ్ల నుంచి ఈ నెట్‌వర్క్ చురుగ్గా పనిచేస్తున్నట్లు వెల్లడించారు.

**తావ్‌డేపై గతంలో కూడా ఆరోపణలు..** ఈ కేసులో కీలక నిందితుడైన ససూన్ ఆస్పత్రి ఫోరెన్సిక్ విభాగం అధిపతి డాక్టర్ తావ్‌డేపై గతంలో కూడా తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తాయి. డ్రగ్ కేసులు, కిడ్నీ మార్పిడి రాకెట్ వంటి నేరాల్లో అతడి పేరు వినిపించింది. అయినా కానీ, అతడిని ఫోరెన్సిక్ విభాగానికి అధిపతిగా పదోన్నతి కల్పించారు. స్థానిక రాజకీయ నాయకుల అండదండలతోనే ఇలా జరిగినట్లు తెలుస్తోంది. గత నెలలో ససూన్ ఆస్పత్రి డీన్ వినాయక్ కాలే మాట్లాడుతూ మహారాష్ట్ర మంత్రి హసన్ ముష్రాఫ్, స్థానిక ఎమ్మెల్యే సునీల్ టింగ్రేల నుంచి ఓ లేఖ వచ్చిందని.. దానిలో తావ్‌డేను హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ చేయాలని సూచించినట్లు వెల్లడించారు. ఈ ప్రకటన తర్వాత వినాయక్ కాలేను ప్రభుత్వం బలవంతపు సెలవుపై పంపించింది. ఈయన ప్రస్తావించిన ఇద్దరు నేతలు అజిత్ పవార్ వర్గానికి చెందినవారే. ప్రమాదం జరిగిన కొద్ది గంటల్లోనే యర్వాడ పోలీస్ స్టేషన్‌ను ఎమ్మెల్యే సునీల్ సందర్శించడం విమర్శలకు దారి తీసిన విషయం తెలిసిందే. ఈ వ్యహారంలో బ్రోకర్ అష్ఫాక్ మకాన్‌దార్‌తో సునీల్‌కు సన్నిహిత సంబంధాలున్నాయి. 'విశాల్‌కు సాయం చెయ్యి' అని ఎమ్మెల్యే చెప్పడంతోనే అతడు రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది.




## దేశీయంగా బొగ్గు ఉత్పత్తి పెంచుతాం: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

దిల్లీ: మోదీ హయాంలో కోతలు లేకుండా విద్యుత్ అందిస్తున్నామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. అధికంగా బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని చెప్పారు. దిల్లీలో గురువారం ఆయన కేంద్రమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "మనం ఇతర దేశాల నుంచి బొగ్గు దిగుమతి చేసుకుంటున్నాం. రానున్న రోజుల్లో దిగుమతి తగ్గించి దేశీయంగా ఉత్పత్తి పెంచుతాం. ఖనిజాల అన్వేషణ, తవ్వకాల ద్వారా ఉపాధి కల్పనకు కృషి చేస్తాం. బొగ్గు, గనుల మంత్రిత్వ శాఖల అధికారులు ఒక బృందంగా నిబద్ధతతో పనిచేస్తాం" కిషన్‌రెడ్డి చెప్పారు.

**బండి సంజయ్ బాధ్యతల స్వీకరణ :** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్ బాధ్యతలు స్వీకరించారు. దిల్లీలోని హోంశాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.




## కేసీఆర్‌పై ఈడీ కేసు నమోదు: ఎంపీ రఘునందన్ రావు

హైదరాబాద్: మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీ సీఎం కేసీఆర్‌పై ఈడీ కేసు నమోదు చేసిందని అన్నారు. కేసీఆర్ కోసం కొద్దిసేపటి క్రితం కేసీఆర్ కోసం ఈడీ అధికారులు వచ్చారని వ్యాఖ్యానించారు. తన సన్మాన సభలో ఎంపీ రఘునందన్ రావు ఈ వ్యాఖ్యలు చేశారు. జీవిత కాలం మెదక్ ప్రజలకు రుణపడి ఉంటానని, రఘునందన్ అంటే మాటల మనిషి కాదు..చేతల మనిషి అని ఆయన అన్నారు. పైసలు, మందు ఓపెన్‌గా పంచినా ఓడిపోయారని ఎన్నికలను ప్రస్తావించారు. వెంకట్రామిరెడ్డి వెయ్యి కోట్లు పెడితే వాటిని లెక్కచేయకుండా గెలిచానని, రాజకీయాల్లో రాణించాలంటే ఆత్మ విశ్వాసం ఉండాలని ఆయన వ్యాఖ్యానించారు. కేసీఆర్, హరీష్ రావు, వెంకట్రామిరెడ్డిలకు ముందుంది ముసళ్ళ పండుగ అని రఘునందన్ రావు వ్యాఖ్యానించారు. " సిద్ధిపేటలో హరీష్ రావు ఉండగా...ఎస్సార్ట్‌లో ఆయన ఉన్న మీటింగ్‌కి ఇంకొకరు వస్తారని హరీష్ రావు కూడా ఊహించలేదు.

దుబ్బాకలో దెబ్బ కొట్టిన అని ఆరడుగుల హరీశ్ ఎగిరిందు. యుద్ధం మొదలు పెట్టాక గెలిచేవరకు ఒదిలిపెట్టొద్దు. లక్ష్యాన్ని నిర్దేశించుకొని క్యాడర్‌తో కలిసి ముందుకు సాగాలి. జనం గుండెల్లో ఉన్నాం కాబట్టి గెలిచాం" అని రఘునందన్ రావు అన్నారు.




## నీట్ పరీక్షలో ఆ 1500 మందికి గ్రేస్ మార్కులను తీసేస్తాం: సుప్రీంకు కేంద్రం వెల్లడి

దిల్లీ: ఎంబీబీఎస్, బీడీఎస్.. ఇతర వైద్య కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్)- యూజీ 2024లో అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తిన వేళ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. నీట్ ఫలితాల్లో 1500 మందికి పైగా అభ్యర్థులకు ఇచ్చిన గ్రేస్ మార్కులను తొలగిస్తామని సుప్రీంకోర్టుకు తెలియజేసింది. వారికి మళ్లీ పరీక్ష రాసే అవకాశం కల్పిస్తామని చెప్పింది. ఈ ఏడాది జరిగిన నీట్ పరీక్షలో 1563 మంది విద్యార్థులకు అదనంగా గ్రేస్ మార్కులు ఇచ్చారు. ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల్లో మార్పులు, పరీక్ష కేంద్రాల వద్ద సమయం కోల్పోవడంతో వీటిని కలిపారు. అయితే దీనిపై అభ్యంతరాలు వ్యక్తమవడంతో పాటు నీట్ పరీక్షలో అక్రమాలపై ఆరోపణలు రావడంతో గతవారం కేంద్ర విద్యాశాఖ నలుగురు సభ్యులతో కమిటీ వేసింది. కోల్పోయిన సమయానికి పరిహారంగా గ్రేస్ మార్కులు పొందిన 1563 విద్యార్థులపై ఈ కమిటీ విచారణ జరిపి నివేదిక సమర్పించింది. కమిటీ నిర్ణయాలను కేంద్రం గురువారం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. "కోల్పోయిన సమయానికి పరిహారంగా గ్రేస్ మార్కులు పొందిన ఆ 1563 మంది విద్యార్థుల స్కోర్ కార్డులను రద్దు చేయాలని కమిటీ నిర్ణయించింది. వారికి మళ్లీ పరీక్ష రాసేందుకు అవకాశం కల్పిస్తాం. జూన్ 23న పరీక్ష నిర్వహించి ఈ నెల 30వ తేదీలోగా వారి ఫలితాలను ప్రకటిస్తాం" అని ధర్మాసనానికి కేంద్రం వెల్లడించింది. ఆ తర్వాతే కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపింది. ఒకవేళ మళ్లీ పరీక్ష రాయొద్దని అనుకునే వారు.. గ్రేస్ మార్కులు లేకుండా ఒరిజినల్ మార్కులతో కౌన్సెలింగ్‌కు వెళ్లొచ్చని పేర్కొంది.

**కౌన్సెలింగ్‌పై స్టేకు నిరాకరణ..** ఇక, నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు గురువారం విచారణ జరిపింది. వెబ్ కౌన్సెలింగ్‌పై స్టే ఇచ్చేందుకు న్యాయస్థానం నిరాకరించింది. కౌన్సెలింగ్ యథాతథంగా ఉంటుందని చెప్పిన ధర్మాసనం.. ఈ పిటిషన్లపై రెండు వారాల్లోగానే సమాధానం చెప్పాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి నోటీసులు జారీ చేసింది. అనంతరం దీనిపై తదుపరి విచారణను జులై 8వ తేదీకి వాయిదా వేసింది. జులై 6వ తేదీ నుంచి నీట్ కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. ఈ ఏడాది నీట్ ప్రవేశ పరీక్ష మే 5న దేశవ్యాప్తంగా 4,750 కేంద్రాల్లో జరిగింది. దాదాపు 24 లక్షల మంది అభ్యర్థులు రాశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి 67 మంది విద్యార్థులు 720కి 720 మార్కులు సాధించారు. హరియాణాలోని ఒకే పరీక్షా కేంద్రానికి చెందిన ఆరుగురు విద్యార్థులకు తొలి ర్యాంక్ రావడంతో అనుమానాలు తలెత్తాయి. ఇంత మంది టాప్ ర్యాంకును పంచుకోవడం వెనుక గ్రేస్ మార్కులు కారణమని ఇటీవల విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలోనే 'ఫిజిక్స్ వాలా' విద్యాసంస్థ వ్యవస్థాపకుడు అలఖ్ పాండే దీనిపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ విద్యార్థులకు ర్యాండమ్‌గా 70 నుంచి 80 మార్కులు కలిపారని అన్నారు.

## హరీశ్ రావుకు కాళేశ్వరం కమిషన్ నోటీసులు..!!




హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో బ్యారేజీల నిర్మాణంపై విచారణ ఊపందుకుంది. ఏజెన్సీలను అఫిడవిట్ ఫైల్ చేయమని కాళేశ్వరం కమిషన్ చైర్మన్ చీఫ్ జస్టిస్ చంద్రఘోష్ స్పష్టం చేశారు. ఆ అఫిడవిట్లపై విచారణ కొనసాగుతోందని వివరించారు. టెక్నికల్ అంశాలు సిద్ధమైన తర్వాత ప్రజా ప్రతినిధులకు నోటీసులు ఇస్తామని పేర్కొన్నారు. ఆ తర్వాత భారీ నీటిపారుదల శాఖా మంత్రి, ముఖ్యమంత్రిని విచారణకు పిలుస్తామని వెల్లడించారు. జూలై రెండోవారం లేదంటే ఆ తర్వాత విచారణకు పిలుస్తామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్ మంత్రి హరీశ్ రావుకు త్వరలో నోటీసులు అందే అవకాశం ఉంది. ఆ తర్వాత కేసీఆర్‌కు ఇస్తారని తెలుస్తోంది.


## కబ్జా చేసిన ప్రభుత్వ స్థలాలు పేదలకు పంచుతాం: మంత్రి పొంగులేటి



ఖమ్మం జిల్లా: గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో పేదోడి కష్టం తీర్చే ప్రభుత్వం రావాలని ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్నారని, ఎన్నికల సమయంలో ప్రజలు చెప్పిన సమస్యలు తీర్చేందుకే ప్రజల మధ్యకు వచ్చానని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఖమ్మం రూరల్ మండలం, చిన్నతండాలో ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ.. ఇళ్ల స్థలాలు, ఇళ్ల మంత్రిని తానే కాబట్టి రాబోయే మూడు సంవత్సరాలలోపే అర్హులైన వారికి ఇస్తామని స్పష్టం చేశారు. పాలేరు నియోజకవర్గంలో రాబోయే కొద్ది రోజుల్లోనే ఇళ్ళు ఇస్తామన్నారు. కబ్జా చేసిన ప్రభుత్వ స్థలాలు బయటకు తీసి పేదలకు పంచుతామన్నారు. గడిచిన పది సంవత్సరాల్లో కొత్త రేషన్ కార్డులు, ఆసరా పెన్షన్లు ఇవ్వలేదని ఆరోపించారు.

పేదల కష్టాల్లో పెద్ద కొడుకుగా ఉండి వాటిని తీరుస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.

## పాఠ్యపుస్తకాలు వెనక్కి తీసుకోవాలి.. తెలంగాణ విద్యాశాఖ ఆదేశాలు



హైదరాబాద్: తెలంగాణలో పాఠ్య పుస్తకాలు వెనక్కి తీసుకోవాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. బుధవారం పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు అధికారులు పాఠ్య పుస్తకాలు, వర్క్‌బుక్‌లు పంపిణీ చేశారు. విద్యాశాఖ వీటిలో ముందుమాట మార్చకుండా ముద్రించింది. ఇది వివాదాస్పదం కావడంతో వాటిని వెనక్కి తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చింది.

## జస్టిస్ పీసీ ఘోష్‌ను కలిసిన హైడ్రాలజీ, నిపుణుల కమిటీ ఇంజినీర్లు..



హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ ఏడో బ్లాక్ కుంగుబాటు, పియర్స్, గేట్లు దెబ్బతినడం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో సీపేజీలు సహా పలు సమస్యలపై విచారణ కొనసాగుతోంది. విచారణలో భాగంగా జస్టిస్ పీసీ ఘోష్ న్యాయ విచారణ కమిషన్ను హైడ్రాలజీ, నిపుణుల కమిటీ ఇంజినీర్లు కలిశారు. ఈ మేరకు రెండు వారాల లోపు మధ్యంతర నివేదిక, సాధ్యమైనంత త్వరగా పూర్తిస్థాయి నివేదికను అందించాలని రెండు కమిటీల ఇంజినీర్లను కమిషన్ ఆదేశించింది. టెక్నికల్ అంశాలకు సంబంధించిన విషయంలో అఫిడవిట్ ఫైల్ చేయాలని నిపుణుల కమిటీలకు ఆయన సూచించారు. జూన్ 14న మరి కొంతమంది అధికారులు, ఇతర వ్యక్తులు విచారణకు హాజరు కావాలని కమిషన్ చీఫ్ పీసీ ఘోష్ ఆదేశించారు. త్వరలోనే ఆయన మరోసారి సడన్ ఫీల్డ్ విజిట్ చేయనున్నట్లు తెలుస్తోంది. కాళేశ్వరం కమిషన్ బహిరంగ విచారణకు సిద్ధమవుతోంది. ఈ మేరకు అఫిడవిట్ దాఖలు చేసిన ప్రతి ఒక్కరినీ బహిరంగ విచారణలో భాగస్వామ్యం చేయనున్నారు. విజిలెన్స్ రిపోర్టు ఇవ్వాలంటూ కమిషన్ ప్రభుత్వాన్ని గతంలో ఆదేశించినప్పటికీ ఇంతవరకూ రిపోర్టు కమిషన్‌కు అందలేదు. దీంతో విజిలెన్స్ రిపోర్టు కోసం మరోసారి ప్రభుత్వం, విజిలెన్స్ శాఖకి లేఖ రాయనున్నట్లు తెలుస్తోంది. టెక్నికల్ అంశాలు పూర్తయిన తర్వాత ఆర్థికపరమైన అంశాల మీద దృష్టి పెట్టనున్నట్లు సమాచారం.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను...
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.
సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660